క్లుప్తంగా

అగ్రిమెంట్ పత్రాలు అందజేత



వ్యాపారులకు అగ్రిమెంట్ పత్రాలు అందిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

బెల్లంపల్లి: కూరగాయల మార్కెట్‌లో కేటాయించిన స్టాల్స్‌ను వ్యాపారులు వెంటనే అగ్రిమెంట్ చేసుకోవాలని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్ పర్సన్ శ్వేత కోరారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కొందరు వ్యాపారులు రూ.10వేలు డిపాజిట్ చేసి అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. ఇంకా కొందరు వ్యాపారులు అగ్రిమెంట్ చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, మరో రెండు రోజుల్లోగా అగ్రిమెంట్ చేసుకోనట్‌లైతే ఆ కూరగాయల వ్యాపారుల స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కె.చంద్రశేఖర్, అశోక్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీపీవో ఆకస్మిక పర్యటన



మిట్టపల్లి పర్యటనలో డీపీవో వెంకటేశ్వర్‌రావు

లక్సెట్టిపేట: మండలంలోని మిట్టపల్లి, దౌడేపల్లి, పాత కొమ్ముగూడెం గ్రామాలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లోని వీధులను, రోడ్లను, డ్రెయినేజీలను పరిశీలించారు. నర్సరీ, డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలను చూసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

భీమిని: గ్రామాల్లో ప్రజల వద్ద సేకరించిన మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా బుధవారం భీమిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామాల్లో సేకరించిన మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోల ద్వారా అక్రమంగా కాగజ్‌నగర్ వైపునకు తరలిస్తుండగా భీమినిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. పెద్దపల్లి జిల్లాలోని రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన సునీల్‌కుమార్, మంచిర్యాలలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన చింతల శ్యామలను నిందితులుగా గుర్తించి వారి వద్ద నుంచి రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరు పలు గ్రామాల్లో బియ్యం సేకరించి మహారాష్ట్రకు తరలిస్తారని వివరించారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు. తనిఖీల్లో ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, పోచమల్లు, మల్లేశ్ ఉన్నారు.

లాభాల వాటాలో 35శాతం చెల్లించాలి

శ్రీరాంపూర్: కంపెనీ లాభాలను ప్రకటించి అందులో నుంచి కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలని టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంచె భూపతి, పార్టీ పెద్దపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి తలారీ రాజు బుధవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి 6నెలలు దాటినప్పటికీ, ఇప్పటికి కంపెనీకి వచ్చిన లాభాలెన్నో ప్రకటించలేదన్నారు. వెంటనే వాస్తవ లాభాలు ప్రకటించి వాటా ఇవ్వాలన్నారు. అంతే కాకుండా దసరా అడ్వాన్స్, పీఎల్ఆర్ బోనస్ కూడా చెల్లించాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట లంబాడితండాకు చెందిన అజ్మీర మౌనికకు అంబులెన్స్‌లో ప్రసవం చేయగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. రంజిత్‌కుమార్ భార్య మౌనిక నాలుగో కాన్పు కోసం కాసిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా, సిబ్బంది ఆమెను పరీక్షించి మంచిర్యాల ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108లో రాత్రి 11.45 గంటలకు ఆమెను తీసుకొని మంచిర్యాలకు వెళ్తుండగా, గద్దెరాగడి వద్ద నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది డెలివరీ చేయగా, మగ శిశువుకు జన్మనిచ్చినట్లు తెలిపారు. ఈఎంటీ ఆత్మారావు, పైలెట్ కొమురయ్యలకు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏకమయ్యారు.. రోడ్డు నిర్మించుకున్నారు



కోటపల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నక్కలపల్లి లోత్రౌ వాగుపై ఉన్న వంతెన పూర్తిగా కొట్టుకుని పోయి బ్రహ్మణపల్లి, బద్దంపల్లి, నక్కలపల్లి గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామస్తులు రోడ్డు నిర్మాణం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, స్పందించకపోవడంతో గ్రామస్తులే కలిసికట్టుగా తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేపట్టి రాకపోకలను పునరుద్ధరించుకున్నారు. దీంతో ఎవరో వచ్చి ఏదో చేస్తారని అనుకోకుండా.. రోడ్డు నిర్మాణం చేపట్టిన గ్రామస్తులను పలువురు అభినందించారు.

మహిళా శక్తి క్యాంటీన్లు సద్వినియోగం చేసుకోవాలి



క్యాంటీన్ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

మంచిర్యాలటౌన్: ఇందిరా మహిళా శక్తి స్కీం ద్వారా మంచిర్యాల మున్సిపాలిటీ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. మున్సిపల్ ఆవరణలో బుధవారం 21వ వార్డు ఎల్‌ఐసీ కాలనీలోని శ్రీ రాజరాజేశ్వర ఏరియా లెవల్ ఫెడరేషన్, పంచముఖి హనుమాన్ సంఘ సభ్యురాలు మాదాసు మంగకు రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని మంచిర్యాల పట్టణ సమాఖ్య నుంచి అందించి, క్యాంటీన్‌ను ఏర్పాటు చేయగా, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.విజయ్ కుమార్, జేఏవో అనిత, టీఎంసీ డి.చంద్రయ్య, సీవోలు టి.సుజాత, బి.అరుణ, వి.సరోజ, ఆపరేటర్ డి.సునీత, ఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ సభ్యత్వం పెంచుతాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి, తదితరులు

భీమారం: రానున్న స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పెట్టుకొని గ్రామ స్థాయిలో బీజేపీ సభ్యత్వాలు పెంచుతామని సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రభావంతో గ్రామస్థాయికి కూడా బీజేపీ చొచ్చుకుపోయిందన్నారు. ఈ మేరకు పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసేందుకు బీజేపీ చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో కనీసం 200సభ్యత్వాలు చేయాలనే నిబంధన పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి అక్కల రమేశ్, మండల పార్టీ అధ్యక్షుడు బి.శంకర్, మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ ఆవిడపు సురేష్, ప్రధాన కార్యదర్శి మడెం శ్రీనివాస్, యువమోర్చా అధ్యక్షుడు సెగ్యం సందీప్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మేడి విజయతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన గోపాల కాలువలు



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పెద్దంపేట గ్రామ పంచాయతీలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ గోపాల కాలువల వేడుకలు ఘనంగా ముగిశాయి. శ్రీ కృష్ణ వేషధారణతో శ్రీకృష్ణ చరిత్రను, ఆయన లీలలను ప్రజలకు వివరించారు.గోపిక, శ్రీకృష్ణ వేషధారణల్లో ఉట్టి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పాడిపంట బాగుండాలని, ప్రజలు సుఖశాంతులతో వెల్లివిరియాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గత రెండు రోజులుగా ఊరిలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో వేద పండితులు శ్రీమంతుల సాయినాథాచార్యులు, గొల్లపల్లి సాయిక్రిష్టాచార్యుల బృందం, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, ఆలయ అర్చకుడు మేడారం తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమాలకు తావివ్వకుండా పనిచేయాలి



నివేదికలను వెల్లడిస్తున్న సిబ్బంది

జైపూర్: పల్లెల్లో ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులకు పని కల్పించాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా సిబ్బంది ఆదేశాలను అనుసరిస్తూ పనిచేయాలని డీఆర్‌డీవో పీడీ కిషన్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో 2023 ఏప్రిల్ 1నుంచి 2024మార్చి 31వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20గ్రామ పంచాయతీల్లో 257రకాల పనులకు రూ.2,71,16,216ఖర్చు చేసినట్లుగా పేర్కొన్నారు. ఇందులో రూ.41,632 రికవరీ, జరిమానాల కింద సిబ్బంది నుంచి వసూలు చేయాలని తెలిపారు.గ్రామాల వారీగా చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన నివేదికలను సిబ్బంది వేదిక ద్వారా వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, ఏపీవో వెంకటేశ్వర్లు, స్టేట్ రిసోర్స్ సభ్యులు ప్రదీప్, ఎస్టీం వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

చెన్నూర్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఫిజిరాజా ఆధ్వర్యంలో బుధవారం అండర్ 17బాల, బాలికల, జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించగా ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీలకు జిల్లా నుంచి 270మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ అబ్దుల్ హమీద్, పీడీలు యాకుబ్, గాజుల శ్రీనివాస్, బి. శ్రీనివాస్, కేవీఎం ప్రకాశ్‌రావు, రిటైర్డ్ పీఈటీ రామయ్య, పీడీ దాసరి మల్లేశ్, రోజీ వరకుమార్‌లు పాల్గొన్నారు.

కష్టమవుతోందని కాల్ చేసి..

- ఆటోలో ఆసుపత్రికి బయలుదేరిన గర్భిణి, కుటుంబీకులు
- అవగాహన కల్పించి.. మార్గమధ్యలో అంబులెన్స్‌లో ఎక్కించి..
- నొప్పులు అధికమవడంతో సుఖప్రసవం చేసిన 108 సిబ్బంది



నవజాత శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

వేమనపల్లి: మండలంలోని సూరారం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కుక్కల శ్రీలత పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. మండలం కేంద్రం నుంచి సూరారం వరకు అటవీ మార్గంలో రోడ్డు బాలేక పోవడంతో వెళ్లడం కష్టమవుతోందని, మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కాన్పు చేయించుకునేందుకు ఇష్టం లేక అంబులెన్స్ వద్దని సమాచారం ఇచ్చారు. ఆటోలో వెళ్తున్నామని రావొద్దని అంబులెన్స్ సిబ్బంది తాహిర్‌పాషా, ముజామిల్‌కు తెలుపగా, ఆటోలో వెళ్లడం తల్లీ, బిడ్డకు ప్రమాదమని, అంబులెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో ఆస్పత్రికి తీసుకెళ్లాలని వారికి అవగాహన కల్పించి నచ్చజెప్పారు. మార్గమధ్యలో వారిని అంబులెన్స్‌లో ఎక్కించి బెల్లంపల్లి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా నొప్పులు అధికమయ్యాయి. ఈఎంటీ తాహిర్‌పాష 108 ప్రధాన కార్యాలయానికి ఫోన్ చేసి డాక్టర్ల సలహాలు, సూచనలు పాటిస్తూ కన్నెపల్లి అటవీ మార్గంలో అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం చేశారు. శ్రీలత పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈఎంటీ, పైలెట్ సమయస్ఫూర్తి వల్ల తమకు ఇబ్బంది తప్పిందని కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

తుప్పు.. ముప్పు



వేమనపల్లి: పాతబస్టాండ్ వద్ద ఉన్న బోరింగ్ అడుగుభాగం తుప్పు పట్టింది. గ్రామస్తులందరూ ఈ నీటినే సేవిస్తుండగా, ప్రాణహిత పుష్కరఘాట్ రోడ్డులో ఉండటంతో పొరుగున మహారాష్ట్ర ప్రయాణికులకు సైతం ఈ బోరు దాహార్తిని తీర్చుతుంది. ఎనిమిది నెలలుగా బోరు అడుగుభాగంలో తుప్పు పట్టి రంధ్రం ఏర్పడింది. ఆగిన నీరు బోరులోకి వెళ్లే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకులాల పనివేళలు శాస్త్రీయంగా నిర్ణయించాలి



యూటీఎఫ్ శ్రేణులు, ఉపాధ్యాయుల నిరసన

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల పాఠశాలల పనివేళలు శాస్త్రీయంగా నిర్ణయించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.చక్రపాణి, జి.రాజావేణు డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్, గురుకులాల జేఏసీ దశల వారీ నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం బెల్లంపల్లిలోని మహాత్మాజ్యోతిబా పూలే, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాల, ప్రభుత్వ బాలుర గురుకుల(టీజీఆర్ఎస్) విద్యాలయాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులాల పనివేళలు శాస్త్రీయంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ బెల్లంపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు బబిత, రమేష్, ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదు చేయించుకోవాలి



ప్రైవేట్ టీచర్లతో ట్రస్మా నాయకులు

బెల్లంపల్లి/మందమర్రిరూరల్: ప్రతి పట్టభద్రుడు వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి తప్పక ఓటరు నమోదు చేయించుకోవాలని ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖరరావు కోరారు. బెల్లంపల్లిలోని సేయింట్ ఆంటోని పాఠశాలలో, మందమర్రిలో బుధవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఆరు నెలల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోతున్నాయన్నారు. పట్ట భద్రులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల కోరిక ప్రకారం తాను పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

శ్రీరాంపూర్: వేతనాల పెంపు, లాభాల్లో వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం కేంద్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, యూనియన్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

చెన్నూర్: చెన్నూర్ శనిగకుంట మత్తడిని పేల్చివేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం బీజేపీ నాయకులు శనిగకుంటను సందర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ పేలుడు ఘటనకు పాల్పడిన వ్యక్తులకు సంఘవిద్రోహశక్తులతో సంబంధాలు ఉండే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: సింగరేణి రిటైర్డు కార్మికుల సమస్యలు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి రిటైర్డు కార్మికులు పోస్టుకార్డులు పంపించారు. కార్యక్రమంలో జిల్లా విశ్రాంత కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి ఏ.వేణుమాధవ్, కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛతా హీ సేవ'

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది బుధవారం వార్డులోని చెత్తచెదారం శుభ్రం చేశారు. ప్రజలతో కలిసి వార్డులో పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. సీతారాంపల్లి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో తీగల్‌పహడ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గోదావరి నదిలోని చెత్తాచెదారాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను తీసుకొచ్చి మంచిర్యాల గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. వినాయకులతో పాటు, ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, పూలదండలు, ఇతర వ్యర్థాలు వేయడంతో వాటిని తొలగించారు.



ఘనంగా ఫ్రెషర్స్ డే

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆటపాటలతో ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగశర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేయనున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. మండల కేంద్రంతో పాటు కిష్టాపూర్, మొర్రిగూడ, మందపల్లి, కామన్‌పల్లి, పొనకల్, శ్రీలంక కాలనీ గ్రామాల్లో రూ. 2.16 కోట్లతో మంజూరైన డీఎంఎఫ్‌టీ నిధులతో పలు అభివృద్ధి పనులకు బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వెదురు దినోత్సవంలో పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతో సాధ్యమన్నారు. సబ్బండ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. దశల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేస్తానని, హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

నెన్నెల: సిలబస్ సకాలంలో పూర్తి చేసి పదోతరగతి, ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షల్లో వంద శాతం మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. నెన్నెల కస్తూరిబా పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు టెస్టులు నిర్వహించి వారి సామర్థ్యాలను గుర్తించాలన్నారు. ఉపాధ్యాయులను పాఠాలు బోధించమని, పిల్లలతో కూర్చొని వారి బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులను వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి, వారి నుంచి సమాధానాలు రాబట్టారు. పాఠశాలల్లో మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గది, భోజనశాలతో పాటు హాస్టల్ ఆవరణ అంతా తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట మండల నోడల్ అధికారి ప్రకాష్‌రావు, ఎస్‌వో కవిత ఉన్నారు.

రోడ్డు బాగు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్: గని ఆవరణలోని రోడ్డు బాగు చేయాలని కోరుతూ ఆర్కే న్యూటెక్ గని కార్మికులు వినతిపత్రం సమర్పించారు. కార్మికులంతా కలిసి బుధవారం గని సంక్షేమ అధికారి పాల్‌సృజన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. గని ఆవరణలోని ఆర్కే 7గని ఫ్యాన్ మూలమలుపు వద్ద రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. వర్షం పడితే బురద, ఎండకొడితే విపరీతమైన దుమ్ము లేస్తుందన్నారు. దీంతో కార్మికులకు డ్యూటీలకు వెళ్లి వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే రోడ్డును బాగు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సురేందర్,ప్రసాద్, సదానందం, తిరుపతి, రాజారాం, శ్రీనివాస్, రాజమౌళి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ధర్నా పోస్టర్లు విడుదల

బెల్లంపల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 30న నిర్వహించనున్న ధర్నా పోస్టర్లను ఇఫ్టూ జిల్లా కార్యదర్శి టీ.శ్రీనివాస్ బుధవారం బెల్లంపల్లిలోని సివిక్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. అసంఘటిత కార్మికుల ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇఫ్టూ శ్రేణులు చరణ్, శ్రీనివాస్, దేవమ్మ, కరుణ, మైసక్క, పద్మ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం విస్తీర్ణం పెంపొందించాలి

జన్నారం: జిల్లాలో ఆయిల్ ఫాం సాగు విస్తీర్ణం పెంపొందించాలని, ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని డీహెచ్‌ఎస్‌వో కే.అనిత, డీఏవో కల్పన పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో మ్యాట్రిక్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల క్రీడాకారిణి అలేఖ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమా కళ్యాణి తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలు అందించాలి

మంచిర్యాలటౌన్: వివిధ క్రీడాంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 25లోపు అందించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తిరాజ్ వీర్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పి.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని రెండవ అంతస్తులో గల కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గని ప్రమాదాలుగా గుర్తించాలి

కాసిపేట: సింగరేణిలో జరిగే సంఘటనలు గని ప్రమాదాలుగా గుర్తించి ఒక్కొక్కరికి రూ.కోటి, ఇతర బెనిఫిట్స్ తక్షణమే ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమగూడెం ట్యాంకుబస్తీలో బుధవారం మాట్లాడారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'

తాండూర్: నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. మండలంలోని మాదారం 5 ఇంక్లెన్ గ్రామంలో బుధవారం పోలీసులు ఇంటింటా తనిఖీలు చేపట్టారు.

కొనసాగిన నిమజ్జనాలు

దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని రాజేశ్వర్‌రావుపల్లెలో, దండేపల్లిలో బుధవారం గణనాథుడి నిమజ్జన వేడుకలు కొనసాగాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీరాంపూర్: నస్పూర్ మండల పరిధిలో గురువారం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ రామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.